# కేసీఆర్ జంగ్ సైరన్

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల రాష్ట్ర రైతాంగానికి కలిగే నష్టాలు, పర్యవసానాల గురించి కేసీఆర్ ఈ సమావేశంలో పార్టీ శ్రేణులకు సుదీర్ఘంగా వివరించారు. కృష్ణా నదీ జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడుకొనేందుకు, రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరుకు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాదకర, మూర్ఖ వైఖరిని తిప్పికొట్టి కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను, ప్రాజెక్టులపై హక్కులను నూటికి నూరుశాతం కాపాడేందుకు ఎంతవరకైనా పోరాడాల్సిందేనని సమావేశం ముక్తకంఠంతో ప్రకటించింది.

తెలంగాణభవన్‌లో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, పార్టీ నేతలు పొన్నాల లక్ష్మయ్య, పైలట్ రోహిత్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తదితరులు

### కేంద్రం ఒత్తిడికి ఏనాడూ లొంగలేదు

కేఆర్ఎంబీ పేరుతో కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణ హక్కులను లాక్కొనేందుకు కేంద్రం వేసిన ఎత్తులను పదేండ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం తిప్పికొట్టిందని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాగానే అవగాహనా రాహిత్యంతో సంతకాలు చేసి భవిష్యత్తులో ప్రాజెక్టు మీదికి కూడా పోలేని పరిస్థితి తెచ్చిందని విమర్శించారు. దీన్ని ప్రజామద్దతుతో తిప్పికొడుతామని ప్రకటించారు. నల్లగొండలో భారీ బహిరంగ సభతో ఉద్యమం ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. 'కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా పదేండ్లలో ఏనాడూ తెలంగాణ ప్రాజెక్టులు అప్పగించలేదు. ప్రాజెక్టులు అప్పగించాలని, లేదంటే ఏకపక్షంగా నోటిపై చేస్తామని ఒక సందర్భంలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ బెదిరించారు. కావాలంటే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టుకో, ప్రాజెక్టులను మాత్రం అప్పగించబోమని తేల్చి చెప్పిన. నా ప్రాణం ఉన్నంతవరకు తెలంగాణకు అన్యాయం జరిగితే ఉరుకోను.. ప్రాజెక్టులు అప్పగించే ప్రసక్తే లేదని ఆనాడే స్పష్టంగా చెప్పాను. రాష్ట్రాన్ని పదేండ్లు పదిలంగా కాపాడుకున్నాం. ఇప్పుడు దాన్ని పరాయివాళ్ల పాలు చేస్తున్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఏనాడూ వెనక్కి పోడు. ఉడుత ఊపుకులకు, బెదిరింపులకు భయపడం' అని కేసీఆర్ తేల్చి చెప్పారు.

> తెలంగాణ ప్రజల కోసం, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతవరకైనా కొట్లాడ్తం.. ఈ విషయంలో ఎవ్వరితోనూ రాజీపడం. - కేసీఆర్

### హేమాహేమీల వల్లే కాలేదు

బీఆర్ఎస్‌ను లేకుండా చేస్తామన్న సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతల ప్రకటనలపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నన్ను, నా పార్టీని టచ్ చేయడం నీ (సీఎం రేవంత్) వల్ల కాదు. నీకన్నా హేమాహేమీలను ఎదుర్కొన్న చరిత్ర మాకున్నది. ఎంతో మందిని చూసినం. పెద్ద పెద్ద వాళ్లే ఏమీ చేయలేకపోయారు' అని స్పష్టంచేశారు. 'కేఆర్ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు వెళితే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. డ్యాములకు సున్నం వేయాలన్నా బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలివి లేదు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రాజెక్టులపై అవగాహన లేదు. ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టం కూడా వారికి తెలియదు. ప్రాజెక్టులపై కేంద్రం పెత్తనం వస్తే మనం అడుక్కు తినాల్సి వస్తుంది. అందుకే మన ప్రభుత్వం ఉండగా ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకోలేదు. ఇప్పుడు ఆ అవగాహన లేకే అప్పగింతకు ఒప్పుకున్నారు. ఇప్పుడున్న పాలకులకు ప్రాజెక్టులు, నీళ్ల గురించి అవగాహన లేకపోవడంతో కేంద్రం గేమ్ స్టార్ట్ చేసింది. ప్రాజెక్టు కేంద్ర అధీనంలోకి వెళితే తెలంగాణ నష్టపోతుంది. ప్రజలకు ఈ విషయాన్ని వివరించి చెప్పాలి. కాంగ్రెస్ నేతలకు అవగాహన లేక ఏదేదో మాట్లాడుతున్నారు' అని కేసీఆర్ విమర్శించారు.

> కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలివి లేదు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులపై అవగాహన లేదు. ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగిస్తే, కేంద్రం పెత్తనం వస్తే మనం అడుక్కు తినాల్సి వస్తుంది. - కేసీఆర్

తెలంగాణభవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

> నన్ను, నా పార్టీని ఎవరూ టచ్ చేయలేరు. హేమాహేమీలను ఎదుర్కొన్న చరిత్ర మాది. ఎంతో మందిని చూసినం. పెద్దపెద్ద వాళ్లే ఏమీ చేయలేకపోయారు. - కేసీఆర్

### మనం తొందరపడొద్దు.. వాళ్లే తన్నుకుంటారు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరో కూల్చాల్సిన అవసరం లేదని, ప్రభుత్వాన్ని కూల్చేందుకు గడ్డపారలు పట్టుకొని తిరగాల్సిన పని లేదని కేసీఆర్ అన్నారు. వాళ్లలో వాళ్లే (కాంగ్రెస్ నేతలు) తన్నుకుంటారని, ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలే తిరుగుబాటు చేస్తారని చెప్పారు. రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని, పాలన చేయడం చేతకాక అడ్డగోలుగా బీఆర్ఎస్‌పై మాట్లాడుతున్నారని, ప్రజాక్షేత్రంలోనే వారికి జవాబు చెప్తామని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, జీ జగదీష్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వీ శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్ మల్లారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్‌తో, ఎంపీలు, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ మున్సిపల్ చైర్మన్లు తదితరులు భారీగా పాల్గొన్నారు.

### సభలో మనమేం తక్కువ మందిమి లేము

శాసనసభలో కూడా కేఆర్ఎంబీ విషయమై పోరాడుదామని కేసీఆర్ చెప్పారు. 'శాసనసభలో ఇప్పుడు బీఆర్ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలున్నారు. 39 మంది అంటే ఆషామాషీ నంబరు కాదు. ప్రభుత్వం మెడలు వంచే వరకు మన ఎమ్మెల్యేలు సభలో కొట్లాడుతారు. మనం సభ బయట ప్రజల్లో ప్రభుత్వంపై కొట్లాడుదాం. బీఆర్ఎస్ కార్యకర్తలకు కొట్లాడటం కొత్తకాదు. ఉద్యమకాలంలో అనేక ఉద్యమాలు చేశాం' అని గుర్తుచేశారు. 'జిట్టా బాలకృష్ణారెడ్డి.. మనం మళ్లా పాత రోజులు గుర్తు చేసుకుందాం.. కొట్లాటకు సిద్ధమవుదామా?' అని కేసీఆర్ సమావేశంలో పాల్గొన్న భువనగిరి ఉద్యమ నేత జిట్టా బాలకృష్ణారెడ్డిని ఉద్దేశించి అన్నారు. నల్లగొండలో తల్వార్‌లు తిప్పుదామా రవీందర్ సింగ్? అని సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌ను ఉద్దేశించి అన్నారు.

> కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహనా రాహిత్యంతో సంతకాలు చేసి భవిష్యత్తులో ప్రాజెక్టు మీదికి కూడా పోలేని పరిస్థితి తెచ్చింది. దీన్ని ప్రజామద్దతుతో తిప్పికొడతాం. - కేసీఆర్

బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో సమావేశమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తదితరులు

## నల్లగొండలో 13న సభ

మొదటిపేజీ తరువాయి...

ఉన్న ప్రాజెక్టులన్నింటినీ అప్పజెప్పి కేంద్రం చేతికి మన జుట్టు అందించిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ప్రజాక్షేత్రంలోనే ఎండగడుతామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగు, తాగునీరు అందక తిరిగి కరువు కోరల్లో చిక్కుకునే ప్రమాదం పొంచివున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. 'మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏం మాట్లాడిండో చూసినం. మన సభకు ఎట్లా అనుమతివ్వరో చూద్దాం. మనం ఆరు నూరైనా నల్లగొండలో సభ పెట్టి తీరుతాం. అద్భుతంగా, బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేసుకుందాం. సభ నిర్వహణకు ప్రతీ నియోజకవర్గానికి ఒక సమన్వయకర్తను కూడా వేసుకుందాం' అని సీఎం చెప్పారు.

### నియోజకవర్గ సమన్వయకర్తలు వీరే

నల్గొండ- రవీందర్‌సింగ్ (సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్), సూర్యాపేట-జోగురామన్న (మాజీ మంత్రి), హుజూర్‌నగర్- క్రాంతి కిరణ్ (మాజీ ఎమ్మెల్యే), మునుగోడు- నందికంటి శ్రీధర్ (ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్), ఆలేరు- కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు (మాజీ ఎమ్మెల్యే), నకిరేకల్- బాల్క సుమన్ (మాజీ ఎమ్మెల్యే), కోదాడ- తక్కళ్లపల్లి రవీందర్‌రావు (ఎమ్మెల్సీ), భువనగిరి- సుంకె రవిశంకర్ (మాజీ ఎమ్మెల్యే), జీవీ రామకృష్ణారావు (కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు), దేవరకొండ- పన్యాల భూపతిరెడ్డి, తుంగతుర్తి- ఆశన్నగారి జీవన్‌రెడ్డి (మాజీ ఎమ్మెల్యే), మిర్యాలగూడ- సింధూ ఆదర్శ్‌రెడ్డి (పటాన్‌చెరు నియోజకవర్గ నేత), నాగార్జునసాగర్- జాజాల సురేందర్ (మాజీ ఎమ్మెల్యే).

## నల్లగొండలో కాంగ్రెస్ పోటీ సభ

- మూడో వారంలో నిర్వహణ
- ప్రియాంకగాంధీని ఆహ్వానించాలని కాంగ్రెస్ పీఈసీ నిర్ణయం
- 2 లక్షల మంది సమీకరణ లక్ష్యం
- కాళేశ్వరంపై తగ్గొద్దొన్న సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): నల్లగొండలో బీఆర్ఎస్ సభకు పోటీగా తాము కూడా భారీ సభను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. గాంధీభవన్‌లో మంగళవారం ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశం పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. నల్లగొండలో బీఆర్ఎస్ తలపెట్టిన సభకు పోటీగా నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో భారీ సభ నిర్వహించి దానికి పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీని ఆహ్వానించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన ప్రతిపాదనకు పార్టీ ఆమోదం తెలిపినట్టు తెలిసింది. ఈ సభను రెండు లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన అనంతరం ఈ నెల 3వ వారంలో సభ ఏర్పాటుకు సూచన ప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై తగ్గొద్దని పార్టీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ నేతల ఆరోపణలు, విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలని సూచించినట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో 13 సీట్లకు తగ్గకుండా గెలుచుకునే విధంగా కృషి చేయాలని రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది.

### 15న తిరిగి పీఈసీ భేటీ

ప్రదేశ్ ఎన్నికల కమిటీ తిరిగి ఈ నెల 15న సమావేశం కావాలని నిర్ణయించింది. వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన దరఖాస్తులను పీఈసీ సభ్యులకు అందజేసి, బుధవారం వరకు ఒక్కో నియోజక వర్గం నుంచి మూడు పేర్లను సూచిస్తూ అందజేయాలని సమావేశం ఆదేశించినట్టు తెలిసింది. షార్ట్ తర్వాత వారి అభ్యర్థిత్వాలపై 15నాటి సమావేశంలో చర్చించి కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపించాలని నిర్ణయించింది. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాసు మున్షీ, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీశ్‌చౌదరి, సభ్యులు జిగ్నేశ్ మేవాని, విశ్వజిత్ కదమ్, పీఈసీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు జానారెడ్డి, జీవన్‌రెడ్డి, రేణుకాచౌదరి, జే గీతారెడ్డి తదితరులు హాజరయ్యారు.

## మిషన్ భగీరథపై విచారణకు సీఎం ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): మిషన్ భగీరథ పథకంలో అవకతవకలు జరిగాయంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో మిషన్ భగీరథ పనులపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్టు ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో విజిలెన్స్ విచారణ జరపాలని నిర్ణయించారు. మెటీరియల్ కొనుగోలు వ్యవహారంలో గోల్‌మాల్ జరిగినట్టు, పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారనే ఫిర్యాదులు రావడంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

# తెలంగాణ భవన్‌లో ఉద్యమ జోష్

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటిసారి కేసీఆర్ రాక
- బీఆర్ఎస్ అధినేతకు గులాబీ శ్రేణుల ఘనస్వాగతం
- పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు, మహిళలు
- జై తెలంగాణ నినాదాలతో మార్మోగిన భవన్

అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి తెలంగాణభవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలతో తెలంగాణ భవన్ మార్మోగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తొలిసారిగా రాగా, తెలంగాణ భవన్‌లో ఉద్యమ జోష్ కనిపించింది. తుంటికి ఆపరేషన్ చేయించుకొని డాక్టర్ల సూచనతో విశ్రాంతి తీసుకున్న కేసీఆర్.. అసెంబ్లీ ఎన్నికల అనంతరం మంగళవారం భవన్‌లో అడుగుపెట్టగా.. పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆయనకు స్వాగతం పలికేందుకు తెలంగాణ భవన్‌ను అందంగా తీర్చిదిద్దారు. పూలతో అలంకరించారు. వివిధ జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు, మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మహిళలు మంగళహారతులతో కేసీఆర్‌కు స్వాగతం పలికారు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో కేసీఆర్ తెలంగాణ భవన్‌లో అడుగుపెట్టగా.. ఆ సమయంలో పార్టీ నాయకులు ఒక్కసారిగా జై కేసీఆర్, జై తెలంగాణ, కేసీఆర్ జిందాబాద్, బీఆర్ఎస్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన కారుకు దారి ఇవ్వడానికి.. పార్టీ కార్యకర్తలను పక్కకు జరపడానికి నాయకులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కేసీఆర్‌ను చూసేందుకు అందరూ పోటీ పడ్డారు. కేటీఆర్ స్వయంగా వారందరినీ పక్కకు జరుపుకొంటూ కేసీఆర్‌ను లోపలికి తీసుకెళ్లారు.

### జిల్లాలవారీగా నాయకులతో విడివిడిగా సమావేశం

తెలంగాణ భవన్‌లో సమావేశం అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో కేసీఆర్ విడివిడిగా సమావేశమయ్యారు. ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించి కార్యాచరణపై పలు సూచనలు ఇచ్చారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించుకోవాలని సూచించినట్టు సమాచారం. సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించడం ద్వారా జరిగే నష్టాన్ని వివరిస్తే ప్రజలు, రైతుల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చే అవకాశం ఉంటుందని ఆయన వారికి తెలిపారు. ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలవారీగా కేసీఆర్ మాట్లాడారు.

# హక్కులు తేల్చేవరకు ఉద్యమం

- కాంగ్రెస్ పాలనలో నీటి హక్కుల్లేవ్
- కేఆర్ఎంబీకి అప్పగింతతో నష్టం
- ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి
- 13వ తేదీన చలో నల్లగొండ.. ఉద్యమ శంఖారావం
- సభకు ఆంక్షలు విధిస్తే కోర్టుకు: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నీటి హక్కులు తేలే వరకు ఉద్యమాన్ని వదిలిపెట్టబోమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో కేఆర్ఎంబీ సమావేశం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీనత మూలంగా ప్రాజెక్టుల నిర్వహణ కేంద్రం పరిధిలోకి వెళ్లిపోయిందని తెలిపారు. ఇంత పెద్ద నిర్ణయం తీసుకొని రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షానికి చెప్పలేదని విమర్శించారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించిన నేపథ్యంలో ఉమ్మడి 5 జిల్లాల ముఖ్య నేతలతో కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ లింగయ్యయాదవ్‌తో కలిసి మీడియా సమావేశంలో నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు తెలంగాణ ప్రయోజనాలను వెండి పళ్లెంలో కేంద్రానికి అప్పగించిందంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టులా మారిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఇరు రాష్ట్రాలకు కృష్ణా నదీ జలాలు జీవన్మరణ సమస్య అని పేర్కొన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన లేకుండా.. అప్రమత్తంగా ఉండకుండా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్లాయని తెలిపారు. ఇది రాష్ట్రానికి గొడ్డలిపెట్టులాంటిదని తెలిపారు. ఈ నిర్ణయంపై కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. గత నెల 17న జరిగిన కేంద్ర జల్‌శక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణ కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ సర్కారు అంగీకరించిందని, ఈ విషయాన్ని గడపగడపకూ తీసుకెళ్తామని తెలిపారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై అనేక షరతులు విధించామని తెలిపారు. అందువల్లే నిర్ణయం వాయిదా పడుతూ వచ్చిందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాజెక్టులపై సరైన అవగాహన, వ్యూహం లేకపోవడం వల్ల తొందరపాటుతో కేఆర్ఎంబీకి అప్పగించాలని నిర్ణయించిందని తెలిపారు.

### నీటివాటా తేలేదాకా విశ్రమించం

కేవలం రెండు నెలలోపే కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచితంగా ఆలోచించి తెలంగాణ శాశ్వత ప్రయోజనాలకు దెబ్బకొట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రానికి ప్రాజెక్టుల నిర్వహణ హక్కులు ఇవ్వడం అంటే ఆంధ్రా ప్రయోజనాలు నెరవేర్చడమేనని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల దాదాపు పూర్తయ్యిందని, కేవలం కాలువలు మాత్రమే మిగిలిపోయాయని అన్నారు. దానికి సాగునీళ్లు ఎలా తెస్తారని ప్రశ్నించారు. తెలంగాణ నీటివాటా తేలే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. నీటి హక్కులు కాపాడాలని కోరితే కేసీఆర్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. నల్లగొండ సభకు ఆంక్షలు విధిస్తే కోర్టును ఆశ్రయిస్తామని, ఆంక్షలతో సభను అడ్డుకోలేరని అన్నారు. మంత్రి ఉత్తమ్ రాజకీయ గురువు వైఎస్సార్‌నే ఎదుర్కొన్నామని చెప్పారు.

## రిజర్వాయర్ కట్టుకుంటం సహకరించండి

- తెలంగాణ ప్రభుత్వానికి కర్ణాటక ఎమ్మెల్యేల వినతి
- తుంగభద్ర ఎగువన మరో జలాశయం
- కాళేశ్వరం ప్రాజెక్ట్‌ల సందర్శన

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువన మరొక బ్యాలెన్సింగ్ జలాశయ నిర్మాణానికి సహకరించాలని కర్ణాటక శాసనసభ అంచనాల కమిటీ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఆ రాష్ట్ర ఎమ్మెల్యేల బృందం మంగళవారం నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశమైంది. పూడికతో తుంగభద్ర ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం 32 టీఎంసీలకు తగ్గిందని వారు వెల్లడించారు. అందువల్ల నదిపై ఎగువన మరొక జలాశయాన్ని నిర్మించాలనే ఆలోచనలో కర్ణాటక ప్రభుత్వం ఉన్నదని తెలిపారు. తుంగభద్ర ఉమ్మడి ప్రాజెక్ట్ కావడంతో తెలంగాణ కూడా సమ్మతించాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాల్సి ఉన్నదని నీటి పారుదల అధికారులు, ఇంజినీర్లు ఎమ్మెల్యేలకు వివరించారు.